IJCRT.ORG ISSN : 2320-2882
INTERNATIONAL JOURNAL OF CREATIVE RESEARCH THOUGHTS (IJCRT)
An International Open Access, Peer-reviewed, Refereed Journal

# నల్గొండ జిల్లా దళిత కవిత్వం – వస్తు వైవిధ్యం

గరిగంటి కృపాకర్
పిహెచ్. డి పరిశోధక విద్యార్థి
ఉస్మానియా విశ్వ విద్యాలయం

సామాజికంగా నిమ్నస్థానంలో అనుభవిస్తున్న ప్రజలు దళిత శబ్దాన్ని ఆత్మ గౌరవానికి ప్రతీకగా భావిస్తున్నారు. దళిత సాహిత్యాన్ని ఎవరు రాసినా దాని మౌలిక స్వభావం, లక్ష్యాలను వీడనంతవరకు దాన్ని దళిత సాహిత్యంగానే పరిగణించవచ్చు. దళిత సాహిత్యాన్ని రాయటం సామాజిక చైతన్యం, సామాజిక పరివర్తనకు బాధ్యతాయుతమైన పనిగా ఆచరించటం దళిత సాహిత్యం అవుతుంది. తెలుగు సాహిత్యంలో వచ్చిన అన్ని సామాజిక ఉద్యమాలు తమ అస్తిత్వాన్ని నిలబెట్టుకోడానికి ప్రయత్నం చేశాయి. అందులో భాగంగానే దళిత ఉద్యమం కూడా అస్తిత్వం పోరాటం కోసం ఆవిర్భావానికి నాంది పలికింది.

## 2.1.నల్గొండ జిల్లా దళిత కవిత్వం – వస్తు వైవిధ్యం:

నల్గొండ జిల్లా దళిత కవుల కవిత్వ వస్తువును పరిశీలిస్తే దళితల జీవన విధానం తెలుస్తుంది. నల్గొండ జిల్లా సాహితీ సంపదకు నిలయమని చెప్పవచ్చు. ఉద్యమ నేపథ్యం కలిగిని జిల్లా నల్గొండ. ఈ జిల్లా నుంచి ఎంతో మంది కవులు, రచయితలు, రచయిత్రులు తమ అస్తిత్వ గొంతును వినిపిస్తున్నారు. ఈ జిల్లాకు చెందిన 'దున్న ఇద్దాసు' మొదటి దళిత కవిగా తెలుగు సాహిత్యంలో గుర్తించడం జరిగింది. దళిత సమాజంపై జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించడానికి నల్గొండ జిల్లా వర్తమాన కవులు వారి సాహిత్యం ద్వారా కృషి చేస్తున్నారు. అందులో పిట్టల శ్రీనివాస్, దాసరి లింగస్వామి, బండారు శంకర్, కొమ్ము సుధాకర్, వరకుమార్ గుండెపంగు, ఆనంద్ పెరుమాళ్ళు లాంటి కవులు దళిత కవిత్వానికి ప్రాణం పోస్తున్నారు. దళితుల పట్ల జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తున్నారు.

### 2.1.1.ఆధిపత్య సంస్కృతి:

**అగ్రకుల సంస్కృతి** భారతదేశంలో అనేక సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలకు సంబంధించిన ముఖ్యమైన సంక్లిష్టమైన విషయంఅగ్రకుల సంస్కృతికి ., దళితుల జీవితాలకు ప్రతికూల ప్రభావం చూపిన అనేక కారణాలు ఉన్నాయిఈ ప్రభావాలు గత అనేక శతాబ్దాలుగా కొనసాగుతున్నాయి .. ఆధిపత్య సంస్కృతి వల్ల దళితుల జీవన విధాన మార్పులను నల్గొండ జిల్లా కవులు స్పందించి రాయడం జరిగింది.

పిట్టల శ్రీనివాస్ రాసిన **"అలుగు"** కవితా సంపుటిలో "ముద్ర" అనే ఖండికను పరిశీలిస్తే అగ్రకులాల ఆధిపత్యం, వివక్షత, ఆచార సాంప్రదాయ ముసుల్లో కింది వర్గాల ప్రజలను అగ్రకులాధిపత్యాలు చేస్తున్నటువంటి దారుణ పరిస్థితిని ఈ కవితలో చెప్పారు.

**ఎంత నీచాతినీచంగా ఆలోచించి సృష్టించారో...?**

**కానీ... ఆధిపత్యాన్ని అమాంతంగా రుద్ది, మనుష్యుల్ని**

**పొరలు పొరలుగా విడదీసి...**

**కుల కంపును కుమ్మరించిన, ఆధిపత్య కులాల**

**దాస్య శృంఖలాల్లో మగ్గి, మగ్గి కళావిహీనమై గరుకు తేలిన**

**మా ముదురు రంగు నుదురుపై...**

**అగ్రకుల విష సంస్కృతి బలవంతంగా రుద్దిన**

**"అస్పృశ్యపు" ముద్ర...** **(అలుగు కవిత్వం–పుట:01)**

ఈ కవితలో ఆధిపత్య కులాల వారు చేసిన దాష్టికానికి నిదర్శనం కనిపిస్తుంది. దళితులు అంటే కేవలం సమాజానికి దూరంగా ఉంచడం, అంటరానివారిగా చిత్రించడం, వేలియడం, కులం అనే భావజాలాన్ని ప్రదర్శించి అస్పృశ్యతకు లోనయ్యేట్టుగా వారి జీవితాలను చిత్రిస్తూ ఎంతో నీచాతి నీచంగా చూడబడిన పరిస్థితి ఈ కవితలో కనిపిస్తుంది. ఎందుకు దళితులు సమాజానికి దూరంగా ఉన్నారు? దానికి కారకులు ఎవరు? ఆధిపత్య వర్గాలు బలహీన కులాలను ఎందుకు మనుషులుగా పరిగణించట్లేదు? అగ్రకుల విషసంస్కృతిని బలవంతంగా వారిపై రుద్దుతున్న తీరును కవి లోతైన పరిశీలన చేశాడనే తెలుస్తుంది. నేటికీ సమాజంలో దళితులు కొన్ని ఆధిపత్య కులాల కింద వారు నలిగిపోతూనే ఉన్నారు. తరతరాలుగా వారి జీవితాన్ని త్యాగం చేస్తున్నప్పటికీ వారి మీద వివక్షత అనేది ఇంకా రూపుమాపలేదని చెప్పవచ్చు. దినంతటికీ కారణం ఎవరు అనేది పరిశీలిస్తే దళిత ప్రజల మీద, దళిత కులాల మీద పెత్తనాలు చలాయిస్తున్న అధిపత్య వర్గాన్ని కవి నిరసిస్తున్నాడు.

అందుకే మనిషిని మనిషిగా చూడని వాడు కులకంపుని కుమ్మరిస్తున్నాడని కవి లోతైన తన భావాలను సామాజిక అధ్యయనం చేస్తున్నాడని ఈ కవితను చదివితే తెలుస్తుంది.

**పంచములని పేరుతో... వంచన చేసి...**

**మనిషిని, మనిషిగా బ్రతుకనివ్వకుండా..**

**ఎదురుపడితే మైల పడతామని, వంచిన తలలు ఎత్తకుండా!**

**మా మెడలపై ఆంక్షల కత్తుల్ని**

**వేలాడ దీసిన లేకి సంస్కృతుల చీకటి పరదాల్ని**

**కొద్ది కొద్దిగా తొలగించుకుంటూ..."** **(అలుగు కవిత్వం : పుట 1)**

పంచములంటే దళితులనే భావన. పంచములు అనే పేరుతో దళితులను విడదీసి, వారి పట్ల వివక్షతను కనబరుస్తూ, సంస్కృతి సంప్రదాయాలకు దూరంగా జీవించేటట్టు సమాజం నుండి వెలివేస్తూ దళిత ప్రజలు

ఎదురుపడితే అంటుకుంటే, ముట్టుకుంటే మైల పడుతుందనే భావన ఆధిపత్య వర్గానికి ఉండేది. అటువంటి తరుణంలో దళిత ప్రజల పరిస్థితి సమాజానికి దూరంగా జీవించడం తప్ప వారిని మనిషిగా గుర్తించే నాథుడే లేకుండా ఉన్నటువంటి స్థితి. ఎందుకు అస్పృశ్యత? ఎందుకు ఈ వివక్షత? సాటి మనిషిగా గుర్తించిన వారికి ఎందుకు ఈ సంస్కృతి సాంప్రదాయాలు? ఒక మనిషిని సమాజాన్నించి వెలివేయడం అది సంస్కృతి అవుతుందా? ఒక మనిషిని ఎదురుపడనీయకుండా, ముట్టుకోనియకుండా గుడిలో ప్రవేశం లేకుండా చేస్తున్నటువంటి పరిస్థితి ఎందుకు? దళిత ప్రజలు అంటే ఎందుకంత చులకన దళితులంటే ఎందుకంత అస్పృశ్యత? వాళ్లని ఎందుకు పంచములనే పేరుతో విడదీయడమని కవి విమర్శిస్తున్నాడు. ఆధిపత్య వర్గాలన్నీ కూడా బ్రహ్మతలలో నుంచి, భుజాల నుంచి, తొడలో నుంచి, పాదాల నుంచి వచ్చారని దళితుల మాత్రం పంచముల పేరుతో వంచన చేసి ఐదవ కులంగా చిత్రించారు. పంచములని వారిని ముట్టుకుంటే మైల పడుతుందని భావన ఆధిపత్య అగ్రకులానికి ఆలోచన ఉండడం వల్ల ఆనాడు అనేకమంది దళితులు ఊరికి దూరంగా, అగ్ర కులాధిపత్యాల వారికి దూరంగా, సామాజికంగా వెలివేయబడ్డారు. దానికి తోడు వారిని ముట్టుకుంటే ఏదో అపచారం జరిగిపోతుందన్న ఆలోచన వారిలో బలంగా నాటుకోవడం వల్ల దళిత ప్రజలు దశాబ్దాల తరబడి సామూహికంగా సామాజికంగా వెలిబడ్డారు. అందుకే కవి పంచములనే పేరుతో విడదీసి మనిషిగా బ్రతకనీయకుండా చేసిన దారుణ దుస్థితిని వివరించారు.

**దళిత రైతు జీవన చిత్రణ :**

దళిత రైతు జీవితాన్ని చిత్రించినప్పుడు వారి పేదరికం, సామాజిక వివక్ష, వ్యవసాయ కష్టాలు, వారి మానవ హక్కుల పోరాటాలు సామాజిక గుర్తింపు ,కోసం చేసే కృషిని గుర్తించాలిసమాజంలో దళిత రైతుల జీవితాలు శ్రమ ., అవమానం, పోరాటం ప్రతిబింబంగా ఉంటాయి. దళిత రైతులు భారతదేశంలోని వ్యవసాయ రంగంలో శరమ్జీవులుగా ఉన్నారువారు అవమానంతో సమాజంలో తక్కువ స్థాయిలో పరిగణించబ .డుతున్నారు .దళితులు పాడిపంటలు వేయడం, దానిని అధికారులు, పెత్తందారుల దోపిడీ వ్యవస్థకు గురి అవుతున్న పరిస్థితిని వివరించారు.

తెలంగాణ ప్రాంతంలో భూస్వాములు దొరలు, పటేల్, పట్వారిల వ్యవస్థ ఉండేది. ఈ భూస్వాములు దళితుల దగ్గర నుంచి వారు పండించిన పంటను స్వాధీనం పరుచుకోవడం, వారు పండిస్తున్న భూములను స్వాధీనం చేసుకోవడడం ఆనాటి కాలంలో కనిపిస్తూనే ఉండేది. భూస్వాములు దళితుల పట్ల, వారి భూముల పట్ల చేస్తున్నటువంటి మోసాలు ఈ కవితలో చెప్తున్నాడు కవి.

**గిది నాయమెట్లైతది...?**
**నీ ఇండ్లెంట నా ఇండ్లుండకుంట జేస్తే...**
**నొష్టి రాతని సరిపుచ్చుకుంటిమి... గానీ...**
**నువ్వు పున్యాన్కి మల్పుకున్న భూమెంట గూడ...**
**నా భూముండొద్దంటే.. ఎట్లా...?**
**నీ మాట శెవున బెట్ట నందుకేగా...?**
**ఊరందర్కీ పారే శెర్వు నీళ్ళు...**

**నీ గట్టు కాన్నే ఆగిపోతున్నయ్?**

**నీళ్ళకు నువ్వేమన్నా సుట్టపోనివా...?** ( అలుగు కవిత్వం పుట :5)

దళితులు సాగు చేసుకుంటున్న భూములను అన్యాయంగా అక్రమంగా వారిని బెదిరించి భూస్వాములు భూములు మలుచుకుంటున్న తీరును కవి అన్యాయాన్ని వివరిస్తున్నాడు.

అగ్రకులాధిపత్యాలు వారు ఉంటున్న సమాజంలో దళితులు ఉండకూడదని వారు అంటరాని వాళ్ళని సమాజంలో ముద్ర వేసి దూరంగా వెలివేశారు. అయినా భరించిన దళితులు అక్రమంగా స్వాధీన పరుచుకున్న భూమి పక్కనే దళితుల భూమి కూడా ఉండొద్దని, వారు భూమి గట్టు మీద నుంచి కూడా నడిస్తే మైల పడుతుందని కంచె వేయడం, భూస్వాముల మాట వినకపోతే చెరువులో నీళ్లు దళితుల భూములకు రానికుండా చేయడం, ఆ నీళ్లను తమ పొలాల వైపు మల్లుకోవడం చేస్తున్నటువంటి తీరును దళితుల రైతు పట్ల చేసిన ఆధిపత్య వర్గాల అన్యాయాన్ని ప్రకటిస్తున్నాడు. అగ్రకులాధిపత్య కిందనే వారి జీవితం కొనసాగాలనే అహంకార భావన. ప్రశ్నిస్తే ఎంతటి దారుణానికైనా తెగిస్తారు. కారంచేడు సంఘటన కూడా చెరువులోని నీళ్లతోనే మొదలై చివరకు మరణకాండను సృష్టించింది. దళితులు సామాజికంగా బతకడానికి కూడా అధిపత్య కులాలవారు సహకరించకపోవడం జరుగుతూనే ఉంది. వారిని బానిసగా మాత్రమే చిత్రిస్తున్నటువంటి సమాజంలో ఉన్నత వర్గం వారిని అణచి వేయబడుతూనే ఉన్నాయి. దీనికి కారణం కేవలం అగ్రకులాధిపత్యం వారి ఆధిపత్య ధోరణిగా చెప్పవచ్చు.

**దళిత స్త్రీ జీవన చిత్రణ:**

పిట్టల శ్రీనివాస్ రాసిన 'ఎట్టి తల్లులు' కవితా ఖండికలో దళిత స్త్రీ జీవన చిత్రణ గురించి ప్రస్తావించారు.

**ఎక్వ కులాల్లోలకు ఎట్టి సాకిరి జేస్తి రే అమ్మలూ**
**బరితెగించిన మాటలు,**
**బలాత్కారాలు, చీత్కారాలు బహుమానాలై**
**ఎతల బత్కులెల్లదీస్తున్న తల్లులారా**
**ఇంకా ఊరి పొలిమేర్లల్ల నల్గిపోతున్న**
**మీరు బత్కనేర్చేదెప్పుడు**
**ఊర్ల గత్తెర లేసినప్పుడు**
**మదమెక్కిన దున్నపోతు బలిదీస్కునే**
**గ్రామదేవతల పేర్లున్న**
**మీరు కులం కొమ్ముల పదునుతో**
**రంకెలేస్తూ మీ మానాలను మంటగల్పుతున్న**
**మదమెక్కిన దున్నపోతుల అహంకారాన్ని**
**బలిదీస్కునే అవతారం ఎప్పుడెత్తుతరు...**
**తల్లులూ...?** (అలుగు కవిత్వం –పుట:18)

ఈ కవితలు కవి దళిత స్త్రీల చైతన్యాన్ని చెప్తున్నాడు. అగ్రకులంలో పుట్టిన స్త్రీలకు, కింది కులాల్లో పుట్టిన స్త్రీలకు ఎంతో వ్యత్యాసం ఉంది. ఆధిపత్య కులల వారు వారి స్త్రీలను ఉన్నత స్థానం ఇచ్చారు. కానీ దళిత స్త్రీలను మాత్రం ఎంతో హీనంగా చూడబడినారు. భారతదేశం భరతమాతగా స్త్రీగా కొలుస్తారు. అటువంటి భరత భూమిలో పుట్టిన స్త్రీలందరూ సమానంగానే చూడబడాలి కదా? కానీ కింది కులాల స్త్రీలకు మాత్రం అనేక ఆంక్షలు, అనేక అవమానాలు, అనేక హింసలు వివక్షత అంటరానితనం అన్నీ కూడా ఆపాదించబడ్డాయి. చిన్నప్పటి నుంచి కట్టు బానిసగా బతికి తల్లితండ్రుల వెంట మోపులెత్తి ఆధిపత్య కులాల ఇంట్లో వెట్టిచాకిరి చేసి ఎన్నో అవమానాలు మాటలను భరించి, స్త్రీల మానాలను కోల్పోయి జీవిస్తున్న దళిత స్త్రీలు ఊరికి దూరంగా పొలిమేరలో నలిగిపోతున్న వారి జీవితాల్లో బతుకు వెలుగు ఎప్పుడు వస్తుంది? అగ్రకులాధిపత్యాలవారు తమపై అహంకారాన్ని ప్రదర్శిస్తూ బలి తీసుకుంటున్న పరిస్థితి ఈ కవితలో కనిపిస్తుంది. కాబట్టి వారిపై ప్రశ్నించే గొంతుకతో, వారిని ఎదిరించే అవతారం ఎత్తాలని కవి దళిత స్త్రీల పట్ల జరుగుతున్న అన్యాయాన్ని అగ్రకులాధిపత్యాల వారు దళిత స్త్రీల పట్ల చేస్తున్న దాడులను, అవమానాలను ఎదురుతిరిగి ప్రశ్నించాలంటూ కవి దళిత స్త్రీ పక్షాన గొంతు ఎత్తుతున్నాడు. ప్రశ్నించే గొంతు లేకపోతే బానిసత్వమే రాజ్యమేలుతుంది. కాబట్టి దళిత స్త్రీలు ఎన్ని కష్టాలు పడి తమ జీవనం కొనసాగిస్తున్నప్పటికీ ఆధిపత్యవర్గం మాత్రం వారిపై తమ జూలాన్ని ప్రదర్శిస్తూనే ఉన్నాయి. దీనికి కారణం వారిలో పెరిగిపోతున్న అహంకారం భావన. లెక్కలేనితనం. మనుషులను చులకనగా చూడడం. దళితులను అంటరానివారిగా గుర్తించడం ప్రధాన కారణంగా ఆధిపత్య ధోరణి కనిపిస్తుందని దళిత స్త్రీల పక్షాన కవి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

**బహుజన దృక్పథం:**

వరకుమార్ గుండెపంగు రాసిన **'దగుల్బాజీ'** కవిత్వంలో బహుజన వాదాన్ని వినిపిస్తున్నాడు.

**"టైం వచ్చింది.!**
**గొడ్డుతోళ్ళను ఒల్సినమాదిగోళ్ళం**
**నీతోలు ఒల్సడం కష్టమా!?**
**బట్టలను ఉతికేటి చాకలోళ్ళం**
**నిన్ను ఉతికి ఆరేయలేమా!?**
**కుండ కుదురులనే చేసేటి కుమ్మరోళ్ళం**
**నిన్ను కుదురుగా ఉంచలేమా!?**
**తాటిచెట్లనే వొంగబెట్టినోళ్ళం**
**నీకు గీసకత్తితో గీతలు పెట్టలేమా!?**
**పొట్టేళ్ళనే కాసేటి గొల్ల/కుర్మలం**
**నీకు దుడ్డుకర్రను తొడగలేమా!??**
**గడ్డంగీయగల్గిన మంగలోళ్ళం**
**నీ పీకెంతదూరం మాకత్తికి!?**

ఇనుమును కాల్చేటి కమ్మరోళ్ళం
నీకు కర్రువాతలు పెట్టలేమా!??
చేపలకే వలలేసే గంగ పుత్రులం
నీకు గాలం వేయడం ఏమంత పని!?
ఉచ్చులేసే ఎరుకలి-యానాదోళ్ళం
నీకు ఉచ్చులు పేనలేమా!?
నిజమేరా దగుల్బాజీ మా టైం వచ్చింది
వృత్తులన్నీ వదలి రాజ్యమేలుడే మిగిలింది
ఆదివాసి గోండు/గిరిజన/కోయ
ఓరీ... ఒక్కరేమిటి దేశమంతా
సబ్బండ కులాలోళ్ళం ఒకటైతం
బరాబర్ నిన్ను ఓటుతో పొడుస్తం. [దగుల్బాజీ -పుట 49 ]

పై కవితల్లో బహుజన వాదాన్ని వినిపిస్తున్నాడు కవి. సమాజంలో తక్కువ సంఖ్యలో ఉన్నటువంటి ఆధిపత్య వర్గం అధికారాన్ని చలాయిస్తున్న దళితులను అన్యాయంగా అణిచివేస్తున్నారు. ప్రజాస్వామ్యాన్ని తమ అధీనంలో కేంద్రీకృతంగా పెట్టుకున్నారు. ఆధిపత్య సమాజాన్ని బహుజనులంతా కలిసి మెలిసి ఉంటే ఆధిపత్య వర్గాన్ని ఓడించడం చాలా తేలికైన పని అని కవి బహుజనవాదాన్ని వినిపిస్తున్నాడు. ఒక్కొక్క బహుజన కులంలో ఒక్కొక్క వృత్తి కలిగిన మేధావులు ఉన్నారని, బహుజనులకు అన్ని వృత్తుల విద్యలు తెలుసని, ఆధిపత్య వర్గాన్ని ఓడించడం ఎంతపని అని కవి బహుజన వాదాన్ని చైతన్యవంతంగా చెబుతున్నారు. ఆవుతోళ్లనే వలసినటువంటి వారు, ఆధిపత్యవర్గాల బట్టలు ఉతికే చాకలి, కుండను తయారు చేసే కుమ్మరి, తాటి కల్లు గీసే వారు, పొట్టేలు గొర్రెలు కాసుకునే కూర్మ గొల్లలు, గడ్డాలు గీసే మంగలోళ్ళు, చేపలకే వలవేసి గంగపుత్రులు, ఉచ్చులేసే ఎరుకలు, యానాదులు, ఆదివాసి, గిరిజన కోయ వంటి అనేక జాతుల వృత్తులన్నీ తెలిసిన విద్యలు. బహుజనులు కలిసికట్టుగా వృత్తులన్నీ వదిలేసి రాజ్యమేలే పరిస్థితి త్వరలో రాబోతుందని, అన్ని విద్యలు తెలిసిన అన్ని జాతుల వారు ఏకమైతే ఆధిపత్య వర్గం అణచివేయబడుతుందని హెచ్చరిస్తున్నాడు కవి. అన్ని వృత్తులు తెలిసిన వారికి ఆధిపత్య వర్గాన్ని అణచివేయడం పెద్ద విషయమేమీ కాదని సమాజంలో సబ్బండ వర్గాల వారందరూ ఏకమై ఆధిపత్య చట్టాన్ని తొలగిస్తామని కవి బహుజన పక్షాన మాట్లాడుతున్నాడు.

**ముగింపు:**

నల్లగొండ జిల్లాకు చెందిన దళిత కవులు దళితుల మీద జరిగినటువంటి దాడులను, అంటరానితనాన్ని, కుల వివక్షతను, చాతుర్వర్ణ వ్యవస్థను వారి కవిత్వాల్లో వివరించారు. దళిత సమాజం మీద ఆధిపత్య వర్గ ప్రభావం ఏ విధంగా ఉందో సామాజికంగా రాజకీయంగా ఆర్థిక పరంగా దళితులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను తమ కలం ద్వారా

అక్షరాలను పదును పెట్టి దళిత సమస్యల మీద కృషి చేస్తున్నారు. తెలుగు సాహిత్యంలో అనేక అస్తితోద్యమాలు ఆవిర్భవించాయి. దళిత సాహిత్యం కిందివర్గ ప్రజల అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి వారి జీవన విధానం మీద పెత్తనాలు, అధికార దౌర్జన్యం, ఆధిపత్య అహంకారం అన్నీ కూడా దళిత సమాజాన్ని చిన్నాభిన్నం చేస్తున్నాయి. అందుకోసమే దళితుల మీద జరుగుతున్న అంశాలపై నల్లగొండ జిల్లా దళిత కవులు సామాజికంగా స్పందించారనే భావించవచ్చు. నల్లగొండ జిల్లా దళిత కవుల కవిత్వాన్ని పరిశీలించినప్పుడు సమాజంలో దళితులు పడుతున్న బాధలను వారి కవిత్వంలో వ్యక్తికరించారు. సమాజం దినదినాభివృద్ధి చెందుతున్నప్పటికీ దళిత సమాజం మీద వివక్షత అనేది నేటికీ రూపుమాపడం లేదు. అనాదిగా అనుభవిస్తూ వస్తున్న వివక్షత ఇంకా కొనసాగుతూనే ఉంది. దానికంతటికీ కారణం ఆధిపత్య వర్గ భావజాలమని భావించవచ్చు.